క్లుప్తంగా

23న గురుకుల ప్రవేశపరీక్ష

నడిగూడెం : 2025–26విద్యా సంవత్సరానికి గాను మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఈ నెల 23న 5వతరగతి ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు స్థానిక గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ చింతల పాటి వాణి గురువారం తెలిపారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు ఈ ప్రవేశప రీక్షకు 520మంది విద్యార్థులకు హాజరు కానున్నట్లు తెలిపారు. విద్యార్థులు గంట ముందు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న పీవి దుర్గాప్రసాద్

హుజూర్‌నగర్‌రూరల్ : విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని జేవీవీ నాయకుడు పీవీ దుర్గాప్రసాద్ అన్నారు. గురువారం మండల పరిధిలోని బూరుగడ్డ, కరక్కాయలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేధిక ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ వారోత్సవాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. సైన్స్ ప్రగతి మానవాళి అభివృద్ధికి గీటురాయి అని అన్నారు. అనంతరం డార్విన్ జీవ రిణామ సిద్ధాంతం గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం నలబోలు శ్రీనివాస రెడ్డి ఉపాధ్యాయులు బొల్లం వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ వీరస్వామి, మైసయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు అధ్యాపకురాలికి డాక్టరేట్

కోదాడ: కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీనగర్‌లో గల కేఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకురాలు వి. శ్రీలత ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఈ నెల 14న డాక్టరేట్ అందుకున్నారు. 'కువలయాశ్వ చరిత్ర– సమగ్ర కావ్యపరిశీలనం' అనే అంశంపై డాక్టర్ సూరంపూడి సుధ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ వరించినట్లు శ్రీలత పేర్కొన్నారు. గురువారం కేఆర్ఆర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హెడ్సరాణి, వైస్ ప్రిన్సిపాల్ చందా అప్పారావు, తోటి అధ్యాపకులు ఆమెను ఘనంగా సన్మానించారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



స్పోర్ట్స్ మెటీరియల్ అందజేస్తున్న నాగిరెడ్డి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కబడ్డీ జాతీయ క్రీడాకారుడు మోర్తాల నాగిరెడ్డి అన్నారు. గురువారం చింతలపాలెం మండలంలోని తమ్మారం హైస్కూల్ విద్యార్థులకు రూ.5వేల విలువగల స్పోర్ట్స్ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాబోయే రోజుల్లో కిష్టపట్టే ప్రాంతం స్పోర్ట్స్ హబ్‌గా మారాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం పవన్, ఉపాధ్యాయులు, కబడ్డీ క్రీడాకారులు తన్నీరు శ్రీను, కె.పవన్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పట్టణవాసులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణానికి చెందిన సినీ డైరెక్టర్ మాధవ్ అజగవా ఆర్ట్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న 'నేనెక్కడున్నా' సినిమా పోస్టర్‌ను గురువారం స్థానికంగా ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం జర్నలిజం, సామాజిక కోణంలో నేనెక్కడున్నా అనే చిత్రాన్ని తెలుగు, హిందీలో నిర్మించినట్లు తెలిపారు. ఇక నుంచి తీసే చిత్రాలలో కోదాడ పరిసర ప్రాంతాల్లో ప్రతిభ ఉన్న కళాకారులను తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఓ పిట్ట కథ డైరెక్టర్ చందు ముండేటి, ప్రముఖులు ఉన్నారు.

స్కూటీని తప్పించబోయి బోల్తాపడిన ట్రాక్టర్

కోదాడరూరల్: స్కూటీని తప్పించబోయి ట్రాక్టర్ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన కోదాడ మండలం నల్లబండగూడెం చెక్‌పోస్టు వద్ద గురువారం జరిగింది. వివరాల ప్రకారం.. కోదాడ మండలం కూచిపూడి గ్రా మానికి చెందిన శిరంశెట్టి శ్రీనివాసరావు ట్రాక్టర్‌పై కోదాడకు వస్తున్నాడు. మార్గమధ్యలో నల్లబండగూడెం శివారులోని చెక్‌పోస్టు వద్ద ఎదురుగా వస్తున్న స్కూటీని తప్పించే క్రమంలో ట్రాక్టర్ పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావుకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని యశోదా ఆస్పత్రికి తరలించారు. స్కూటీపై ఉన్న వ్యక్తికి కూడా స్వల్ప గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. తమకు ఫిర్యాదు అందలేదని రూరల్ పోలీసులు తెలిపారు.

నేటి నుంచి కనకదుర్గమ్మ జాతర

- బేతవోలులో 3రోజుల పాటు వేడుకలు
- ప్రభలు, పూజలకు మాత్రమే అనుమతి
- పోలీస్ బందోబస్తు నడుమ నిర్వహణ
- ఇటీవల నెలకొన్న ఘర్షణలతో గ్రామంలో కొనసాగుతున్న పోలీస్ పికెట్



బేతవోలు కనకదుర్గమ్మ దేవాలయం

చిలుకూరు : మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ బేతవోలు గ్రామంలో ప్రతి ఏడాది అత్యంత వైభవంగా జరిగే కనకదుర్గమ్మ జాతర నేటి (శుక్రవారం) నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు జరగనుంది. ప్రతి ఏడాది శివరాత్రికి ముందు వచ్చే గురు, శుక్ర, శనివారాల్లో ఈ జాతర జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. గురువారం సాయంత్రం గ్రామం నుంచి ప్రభలను దేవాలయం వద్దకు తీసుకెళ్లడం, శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వివిధ పార్టీల ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శన, రాత్రి భారీగా లైటింగ్ ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు, శనివారం ఉదయం రెండో రోజు కోలాట ప్రదర్శన అనంతరం ప్రభలను దేవాలయం నుంచి ఇంటికి తీసుకెళ్లడంతో జాతర ముగుస్తుంది. ఈ ఏడాది గ్రామంలో కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు వ్యక్తుల మధ్య నెలకొన్న వర్గ విభేదాలతో ఇటీవల ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో శాంతిభద్రతలు, ఎన్నికల కోడ్‌ను దృష్టిలో ఉంచుకొని నిబంధనల మేరకు జాతర నిర్వహించుకోవాలని పోలీసులు హెచ్చరించారు. జాతర వద్ద ఎలాంటి సాంస్కృతిక కార్యక్రమాలకు గాని, కోలాట ప్రదర్శనలకు గాని, రెండు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పందేలకు అనుమతులు ఇవ్వలేమని పోలీసులు తేల్చిచెప్పారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రూ.10లక్షలతో నూతన రథం ఏర్పాటు..

గ్రామంలో జాతర సందర్భంగా శుక్రవారం ఉదయం ప్రభలను మాత్రమే దేవాలయం వద్దకు తీసుకెళ్లడం, దేవాలయంలో ప్రత్యేక పూజలు, మొక్కులు తీర్చుకోవడం, శనివారం తిరిగి ప్రభలను ఇంటికి తీసుకెళ్లడం వరకు అనుమతి ఇచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా రూ.10లక్షలతో చేయించిన రథంలో ఆదివారం ఉదయం అమ్మవారి ఊరేగింపు చేయనున్నారు. దీంతో జాతర ముగిస్తుంది. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటన జరగకుండా ఉండేందుకు గ్రామంలో అయిదు రోజులుగా పోలీస్ పికెట్ నిర్వహిస్తున్నారు. అంతే కాకుండా మూడు రోజుల పాటు జరిగే జాతర శాంతియుతంగా నిర్వహించేందుకు కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి, చిలుకూరు ఎస్ఐ సురభి రంబాబుగౌడ్ ఆధ్వర్యంలో నలుగురు ఎస్ఐలు, ప్రత్యేక పోలీస్ బలగాలు, సివిల్ పోలీసులు 70మందితో భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే గ్రామంలో గతంలో మాదిరిగా పండుగ వాతావరణం కనబడని పరిస్థితి నెలకొంది.

మూడు గ్రామాలలో జాతర..

కాగా బేతవోలు గ్రామంతో పాటు శుక్రవారం మండలంలోని కొండాపురం, పోలేనిగూడెం, ఆచార్యులగూడెం గ్రామాల్లో కూడా కకదర్గమ్మ జాతర జరగనుంది. ఆ గ్రామాల్లో శుక్రవారం ఒక్క రోజే కేవలం రాజకీయాలకు అతీతంగా, వ్యక్తిగతంగా ప్రభలను దేవాలయం వద్దకు తీసుకెళ్లడం, ఆలయంలో పూజలు నిర్వహించుకోవడంతో మధ్యాహ్నం జాతర ముగుస్తుంది.

అర్హత లేకుండా వైద్యం చేస్తే చర్యలు తప్పవు

- డీఎంహెచ్ఓ డాక్టర్ కోటాచలం

హుజూర్‌నగర్ : అనుమతులు లేకుండా, అర్హత లేనివారు వైద్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్ఓ డాక్టర్ కోటాచలం హెచ్చరించారు. గురువారం పట్టణంలోని పలు ఆసుపత్రులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలో కొంతకాలంగా డాక్టర్‌గా చలామణి అవుతూ అనుమతులు లేని బోర్డుతో ఆసుపత్రి నిర్వహిస్తూ బాబు క్లినిక్‌ని తనిఖీ చేశారు. అక్కడి క్లినిక్‌లో గ్లూకోజ్ ఎక్కిస్తూ, ఎక్కువ మోతాదులో స్టెరాయిడ్స్ వాడుతున్నట్లు గుర్తించి బాబు క్లినిక్‌ను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. ఆర్ఎంపీలు, పీఎంపీలు ఎక్కడైనా అర్హతకు మించి వైద్యం నిర్వహించినా, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడినా సహించలేదని హెచ్చరించారు. అటువంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట స్టాటిస్టికల్ ఆఫీసర్ వీరయ్య, వైద్య సిబ్బంది ఉన్నారు.



హుజూర్‌నగర్ : అనుమతులు లేని ఆసుపత్రిని సీజ్ చేయిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ కోటాచలం

రిజిస్ట్రేషన్ లేని ఆస్పత్రుల సీజ్

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని స్టార్ ఆస్పత్రి యాజమానికి గురువారం జిల్లా వైద్యాధికారి కోటాచలం నోటీసులు జారీ చేశారు. అనంతరం కన్సల్టింగ్ రూమ్‌ను సీజ్ చేశారు. ఇటీవల ప్రారంభించిన ఈ ఆస్పత్రిని ఆయన సందర్శించి అనుమతి పత్రాలను పరిశీలించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కాకుండా వైద్యసేవలు చేయవద్దని యాజమాన్యాన్ని హెచ్చరించారు.

ఎల్ఆర్ఎస్‌ను రద్దు చేయాలి

నేరేడుచర్ల : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఎల్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని బీఆర్ఎస్ నాయకుడు రాపోలు నవీన్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎల్ఆర్ఎస్‌ను రద్దు చేస్తామని నేటి వరకు చేయలేదన్నారు. మాయమాటలతో గత ఏడాది నుంచి కాంగ్రెస్ కాలం గడుపుతుందన్నారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైనందున ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. తక్షణమే ఎల్ఆర్ఎస్‌ను రద్దు చేసి భారాన్ని తగ్గించాలన్నారు.

రికార్డులో నమోదు చేయాలి

కోదాడరూరల్ : ఎరువుల విక్రయాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేసి స్టాక్ వివరాలను ఆన్‌లైన్ చేయాలని ఏడీఏ యల్లయ్య సూచించారు. గురువారం మండలంలోని ఎర్రవరం పీఏసీఎస్ గోడౌన్‌లో ఎరువుల స్టాక్‌ను పరిశీలించి మాట్లాడారు. ఈ పాస్ లేకుండా ఎరువులను విక్రయించొద్దని సూచించారు. రైతులకు కావాల్సిన ఎరువులను అందుబాటులో ఉండే విధంగా చేసుకోవాలన్నారు. మండలంలోని అన్ని పీఏసీఎస్‌ల పరిధిలోని రైతులకు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ నలజాల శ్రీనివాసరావు, సీఈఓ మౌలాలి, సిబ్బంది ఉన్నారు.

ఉద్యోగ నియామకాలు చేపటాలని ధర్నా

కోదాడ : ఎల్ఐసీ (జీవిత బీమా సంస్థ)లో ఉద్యోగులు ఉద్యోగ విరమణ చేస్తున్నా సంస్థ కొత్త నియామకాలు చేపట్టకపోవడంతో ఉద్యోగులపై పనిభారం పెరిగి తీవ్ర ఇబ్బందులు పడతున్నామని వెంటనే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని గురువారం ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో కోదాడ ఎల్ఐసీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడారు. తమ యూనియన్‌కు సంస్థ గుర్తింపు ఇవ్వడంతో పాటు 2012, 2013 సంవత్సరాలలో నియమించబడిన వారికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్.శ్రీనివాస్, సువర్ణ రాణి, రామకృష్ణ, కరుణ, రవికుమార్, ప్రసాద్, ఉపేందర్, శ్రీనివాస్, శివ, సందీప్, హుస్సేన్‌బీ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు

తహసీల్దార్‌పై చర్య తీసుకోవాలని ఫిర్యాదు

కోదాడ : కోట్ల రూపాయల విలువ చేసే భూములను తండ్రి మరణాంతరం వారసుల్లో ఒకరికి తెలియకుండా మిగిలిన ఇద్దరికి పట్టామార్పిడి చేసిన కోదాడ తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని మృతుడి కుమార్తె గురువారం అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గుడిబండకు చెందిన చింతా శ్రీనివాస రెడ్డి ఇటీవల మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. వారే వారసులని కోదాడ తహసీల్దార్ వారసత్వ సర్టిఫికెట్ కూడా జారీ చేశారు. శ్రీనివాసరెడ్డికి కోదాడలో 6ఎకరాలు, గుడిబండ రెవెన్యూలో 11ఎకరాల భూమి ఉంది. నెల రోజుల క్రితం శ్రీనివాసరెడ్డి పేరు మీద ఉన్న మొత్తం 17ఎకరాల భూమిలో పెద్ద కుమార్తెకు 9ఎకరాలు, భార్యపేరుతో 8ఎకరాలను పట్టామార్పిడి చేశారు. ఈ విషయాన్ని తనకు చెప్పలేదని, వారసత్వంగా ముగ్గురం ఉన్నప్పుడు ముగ్గురికి సమాన వాటాలుగా చేయాల్సి ఉండగా తనకు తెలియకుండా కోదాడ తహసీల్దార్ ఆస్తిని తన అక్క, తల్లి పేర్ల మీదకు మార్పిడి చేశాడని స్థానిక తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని మృతుడి చిన్న కుమార్తె చింతా అనిత అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది.

మంత్రి, ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు సహించం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కోదాడ : సామాజిక మాధ్యమంలో కొందరు మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతిపై అనుచిత వ్యాఖ్యలతో పోస్టులు పెట్టడంతో పాటు ఓ సామాజిక వర్గాన్ని కించపరిచే విధంగా చేస్తే సహించేదిలేదని పలువురు కాంగ్రెస్ బీసీ నాయకులు హెచ్చరించారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కోదాడకు చెందిన సామాజిక కార్యకర్త పాడుగు హుస్సేన్ ఇటీవల సామాజిక మాధ్యమంలో పెట్టిన పోస్టులను వారు తీవ్రంగా ఖండించారు. ఉత్తమ్ దంపతులే బీసీలకు ఎక్కువ అవకాశాలు ఇచ్చారని, సామాజిక మాధ్యమాలలో పోస్టులు పెట్టే వారు పరిధి దాటితే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో బీసీ నాయకులు పారా సీతయ్య, చింతలపాటి శ్రీనివాస్, కందుల కోటేశ్వరరావు, ఈదుల కృష్ణయ్య, సుందరి వెంకటేశ్వర్లు, వంటిపులి వెంకటేష్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, రాజు, సూర్యనారాయణ, కొండయ్య, సైదిబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ



పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

గరిడేపల్లి : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ నేరేడుచర్ల ఆధ్వర్యంలో త్రిపురం సుధాకర్‌రెడ్డి ఆర్థిక సహకారంతో గురువారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు జిలకర వీరస్వామి మాట్లాడారు. లయన్స్ క్లబ్ సేవే లక్ష్యంగా విద్యారంగానికి, వైద్య రంగానికి, దివ్యాంగులకు నిరుపేద కుటుంబాలకు స్వచ్ఛందంగా పనిచేస్తుందన్నారు. విద్యార్థులు ఉన్నతంగా చదువుకొని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని ఆయన కోరారు. పదోతరగతిలో 10జీపీఏ సాధించే విద్యార్థులకు క్లబ్ సభ్యులు నాగేశ్వరరావు రూ.1116లు అందజేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు గుండ్రేటి సైదిరెడ్డి, కార్యదర్శి చింతకుంట్ల పూర్ణచంద్రారెడ్డి, లాయర్ విశ్వనాథ్, నాగేశ్వరరావు, ఇన్‌చార్జ్ హెచ్ఎం రవీందర్‌రెడ్డి, వై.బుచ్చిరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి దాతలు కృషిచేయాలి



కంప్యూటర్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓ

మునగాల : పాఠశాల అభివృద్ధికి గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు, దాతలు కృషిచేయాలని మండల విద్యాధికారి పిడతల వెంకటేశ్వర్లు కోరారు. గురువారం మండలంలోని ముకుందాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు, గ్రామ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఉచితంగా అందజేసిన కంప్యూటర్, ప్రింటర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పాఠశాల పూర్వవిద్యార్థి, ప్రస్తుతం పోలీసు ఉన్నతాధికారి (ఐపీఎస్) నంద్యాల కోటిరెడ్డి సహకారంతో గ్రామానికి చెందిన ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో అందజేసిన కంప్యూటర్, ప్రింటర్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అదే విధంగా విద్యార్థుల సౌకర్యార్థం ఉచిత రవాణా సౌకర్యం నిమిత్తం ఆటోను, పాఠశాల ఆవరణలో రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు ఎస్.హనుమంతరాజు, గ్రామప్రజలు, యూత్ ఆర్.కోటిలింగం, లక్ష్మణ్, బాదె అంజి, నర్రా సుధాకర్‌రెడ్డి, యూనియన్ నాయకులు నర్రా శ్రీపాల్‌రెడ్డి, పందిరి బ్రహ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాతరలో భక్తులకు ఇబ్బందులు కలగొద్దు

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



జాతర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తదితరులు

మేళ్లచెరువు: మండల కేంద్రంలోని స్థానిక స్వయంభులింగేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 26 నుంచి మార్చి 2 వరకు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు కలగనీయొద్దని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. గురువారం ఆర్డీఓ శ్రీనివాసులుతో కలిసి జాతర ఏర్పాట్లను పరిశీలించారు. భక్తుల రద్దీ దృష్ట్యా క్యూలైన్‌లో దర్శనానికి వెళ్లేలా బారికేడ్లు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. తాగునీరు, 24 గంటల వైద్య సదుపాయం, ఫైర్, పోలీస్ కంట్రోల్‌రూం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ రాష్ట్ర అసిస్టెంట్ కమిషనర్ భాస్కర్, తహసీల్దార్ జ్యోతి, సీఐ రజితారెడ్డి, ఎంపీడీఓ ఖాజాఅజ్గర్అలీ, ఎస్సై పరమేష్, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ శంభిరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో మిర్చిబోర్డు ఏర్పాటు చేయాలి



మిర్చిని పరిశీలిస్తున్న పశ్య పద్మ, నాయకులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : తెలంగాణ రాష్ట్రంలో మిర్చిబోర్డు ఏర్పాటు చేయాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. గురువారం చింతలపాలెంలో కల్లాల్లో ఉన్న మిర్చిని పరిశీలించి రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడారు. తెలంగాణలో మిర్చి పంటను ఖమ్మం, వరంగల్ జిల్లాలతో పాటు నల్లగొండ, సూర్యాపేట, భువనగిరి తదితర ప్రాంతాలలో పండిస్తున్నారని, ఈ ప్రాంతాలలో మిర్చి పండించే రైతులు మార్కెట్లో అతి తక్కువ ధరలకు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు లక్షన్నర పెట్టుబడి పెట్టి మిర్చి పంటను పండిస్తున్న రైతులు మార్కెట్‌లో క్వింటా రూ.9వేల నుంచి రూ.10వేలకు అమ్ముకోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. క్వింటాకు రూ.25వేల ధర పడితేనే రైతుకు లాభం కలుగుతుందని, మార్కెట్ జోక్యం పథకం కింద కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులను రాబట్టి మిర్చి రైతులను ఆదుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కంబాల శ్రీనివాస్, దొడ్డ వెంకటయ్య, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన, జిల్లా అధ్యక్షురాలు కోటమ్మ, కౌలు రైతుల జిల్లా అధ్యక్షుడు అన్నెం పాపిరెడ్డి, నాయకులు మామిడి నరసయ్య, మామిడి వెంకటేశ్వర్లు, ఉస్తెల నారాయణరెడ్డి, సారెడ్డి పాపిరెడ్డి, అంకయ్య, రవి, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలి



మునగాల : సభకు వెళ్తున్న నాయకులు



గరిడేపల్లి : బహిరంగ సభకు వెళ్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు అన్నారు. గురువారం ఆ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమానికి పట్టణం నుంచి తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కౌలు రైతులతో సహా రైతులందరికీ రైతుభరోసా, రైతు రుణమాఫీ పథకాలను అమలు చేయాలని కోరారు. వెళ్లిన వారిలో శ్రీను, ఎం.చందర్‌రావు, ఉదయ్, రవి, చారి, వెంకటేశ్వర్లు, నర్సయ్య, శ్రీనివాసరెడ్డి, జానయ్య ఉన్నారు.

మునగాల : సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను, 420హామీలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు ధరావత్ రవి కోరారు. ఈ మేరకు గురువారం పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగే మహాధర్నాకు మండలంలోని కొక్కిరేణి గ్రామం నుంచి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకే మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వెళ్లిన వారిలో నాయకులు వీరబోయిన బాలయ్య, పొన్నం బ్రహ్మం, ఎల్లావుల సైదయ్య, బూరగొమ్ముల కోటయ్య, వీరయ్య, కిట్టయ్య, ఎల్లావుల శివ, గడ్డం రామానుజం, ధరావత్ పాండు ఉన్నారు.

గరిడేపల్లి : ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించే బహిరంగ సభకు మండలంలోని వెలిదండ గ్రామం నుంచి ఆ పార్టీ నాయకులు గురువారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ కార్యదర్శి పోటు లక్ష్మయ్య, కార్యదర్శి మేకల లక్ష్మయ్య, గ్రామ కార్యదర్శి మేకల కనకారావు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వెళ్లిన వారిలో మాశెట్టి అంజయ్య, సాంబయ్య, అంజయ్య, వెంకటయ్య, శ్రీనివాస్‌రెడ్డి, వల్లపుదాసు లచ్చయ్య, వెంకటి, ముత్తయ్య, దాసు, నరేష్, సుందరయ్య తదితరులు ఉన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

హుజూర్‌నగర్ రూరల్ : మండలంలోని వేపలసింగారంలో వేంచేసి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలో భాగంగా ఆలయంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, నీరాజన మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ గావించారు. అనంతరం హోమం నిర్వహించారు. ఈ నెల 22వరకు నిర్వహించే ఉత్సవాల కోసం ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. పూజా కార్యక్రమాలలో అర్చకులు భానుప్రకాష్‌శర్మ, మహేష్ కుమారశర్మ, రంగ భట్టరాచార్యులు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

సోమప్ప జాతర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న చైర్మన్, డైరెక్టర్లు

నేరేడుచర్ల : మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 24నుంచి 28వతేదీ వరకు నిర్వహించే సోమప్ప జాతర పోస్టర్లను గురువారం పట్టణంలో ఆలయ కమిటీ చైర్మన్ చిత్తనూరు సత్యనారాయణ, వైస్ చైర్మన్ లొడంగి లక్ష్మయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ డైరెక్టర్లు పెండెం సైదులు, మాలోతు బాలమణి, నాగు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొణతం చినవెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ తాళ్ల సురేష్‌రెడ్డి, గ్రామ శాఖల అధ్యక్షులు ప్రవీణ్, రహీం, రాచకొండ అజయ్, పాండునాయక్, రంగారెడ్డి, అజీజ్, కృష్ణారావు, వెంకయ్య, నాగు, సైదులు, గోవర్ధన్, రవి, కరుణాకర్, మన్నయ్య, వెంకటేశ్వర్లు, రంగప్ప తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బియ్యం అందజేత

హుజూర్‌నగర్ : పట్టణంలోని మూడో వార్డుకు చెందిన రిక్షా కార్మికుడు ఉత్తేర్ల యాదగిరి అనారోగ్యానికి గురయ్యాడు. ఈ సందర్భంగా అతడి కుటుంబానికి మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ సంపత్‌రెడ్డి సహకారంతో కాంగ్రెస్ నాయకుడు నాగేంద్రబాబు గురువారం 25కేజీల బియ్యం అందజేశారు. ఆయన వెంట స్థానికులు వెంకట్‌రెడ్డి, రాధిక, సంధ్య ఉన్నారు.

గరిడేపల్లి : మండలంలోని గారకుంటతండా పరిధిలోని పల్లెప్రకృతి వనంలో మన సేవకుడిగా జీవనం సాగిస్తున్న ఆవురెల్ల వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వెంకటేశ్వర్లు నిరుపేద కావడంతో గురువారం బీఆర్ఎస్ నాయకులు గుగులోతు హేమల నాయక్, నరేందర్‌నాయక్ బాధిత కుటుంబానికి 25కేజీల బియ్యం, నెలవారి మందుల ఖర్చుల నిమిత్తం నగదు అందజేశారు. కార్యక్రమంలో సర్వారం పీఏసీఎస్ మాజీ చైర్మన్ వీరంరెడ్డి శంభిరెడ్డి, షాంపునాయక్, రవీందర్ పాల్గొన్నారు.

బీసీలు కులగణనలో పాల్గొనాలి

కోదాడ : మొదటి విడత కులగణనలో పాల్గొనలేకపోయిన బీసీలు ప్రస్తుతం రెండోదశ కులగణనలో పాల్గొనాలని కాంగ్రెస్ బీసీ రాష్ట్ర నాయకుడు ఈదుల కృష్ణయ్య గురువారం కోరారు. బీసీ జనాభా ప్రాతిపదికన సరైన రిజర్వేషన్లు కల్పించడానికి ప్రభుత్వం చేస్తున్న కృషికి బీసీలంతా సహకరించాలన్నారు. విమర్శలు చేస్తున్న పార్టీలు కులగణనలో పాల్గొనే విధంగా చైతన్యపరచాలని కోరారు.

సాయిమందిరంలో అన్నదానం

కోదాడరూరల్ : మండల పరిధిలోని నల్లబండగూడెం శివారులోగల సాయి మందిరంలో గురువారం స్వామివారికి పంచామృతాభిషేకాలు, విశేషపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేతిరెడ్డి సత్యనారాయణరెడ్డి–రాధా దంపతులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో దినేష్‌రెడ్డి, వరణ్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ నల్లపా టి నర్సింహరావు, అర్చకులు సాయిశర్మ పాల్గొన్నారు.

మునగాల : మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి దేవాలయ ప్రాంగణంలో గల షిరిడీసాయి మందిరంలో గురువారం మండల కేంద్రానికి చెందిన కోట నారాయణమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమార్తెలు భ్రమరాంబ, ఇందిర, అల్లుడు తూముల మల్లికార్జున్ సాయి భక్తులకు అన్నదాన వితరణ చేశారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన దేవినేని రవికుమార్, తడకమళ్ల శ్రీనివాసాచారి, సింగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బాలాజీ, పెనుగొండ వెంకటచలపతి, కుందూరు వీరభద్రం, వెంకటనారాయణ, కోదాటి శ్రీను, భక్తులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని లింగగిరి వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను గురువారం మండల పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం .. అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో లింగగిరి గ్రామానికి వెళ్తుండగా ఇసుక ట్రాక్టర్‌తో వస్తున్న హుజూర్‌నగర్‌కు చెందిన డ్రైవర్ ఎర్లగొర్ల నాగరాజును అరెస్టు చేసి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నేరేడుచర్ల : ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ సురిగి సైదులు, ఎంఈఓ పి.సత్యనారాయణరెడ్డి, ఎస్ఐ రవీందర్‌నాయక్ పరిశీలించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు గాను మండలంలో 35 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

విద్యుత్ ఉద్యోగుల అరెస్టు బాధాకరం

గరిడేపల్లి : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ ఉద్యోగులు సీఐటీయూ, టీజీయూసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధ ఎదుట ధర్నాకు వెళ్తున్న ఉద్యోగులను పోలీసులు అక్రమ అరెస్టులు చేయడం బాధాకరమని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్‌కె.యాకూబ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంఎస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హతలు ఉన్న వారిని 307 జీవో ప్రకారం ఐదేళ్ల పనిచేసే ఐదు ఇంక్రిమెంట్‌లు ఉన్నవారికి రెగ్యులరైజ్ చేయాలని నిబంధన ఉందని, ఆర్టిజెన్స్‌ను కన్వర్ట్ చేయడంతో సంస్థకు ఎటువంటి ఆర్థికపరమైన ఇబ్బందులు లేనప్పటికీ రెగ్యులరైజ్ చేయడానికి ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు.

బేతవోలులో పారిశుద్ధ్య పనులు

చిలుకూరు : మండలంలోని బేతవోలు గ్రామంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న కనకదుర్గమ్మ జాతర సందర్భంగా గురువారం పంచాయతీ సిబ్బంది గ్రామంలో పారిశుద్ధ్య నివారణ చర్యలు చేపట్టారు. వీధుల్లోని డ్రెయినేజీలను శుభ్రం చేయడంతోపాటు, బ్లీచింగ్ పౌడర్ చల్లించడం, వీధి లైట్లు మరమ్మతులు చేయించడం, మంచినీటి సమస్య లేకుండా చూస్తున్నట్లు కార్యదర్శి సత్యనారాయణ వెల్లడించారు. జాతరకు వచ్చే భక్తులను ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.